


# విభారె

## తెలుగు దినపత్రిక

## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి గురువారం 01-02-2024 సంపుటి : 06 సంచిక : 143 పేజీలు : 8 వెల : రూ 3-00











**వచ్చే వారంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ**

**మహిళ సాధికారతే లక్ష్యంగా సాగుతున్న జగనన్న పరిపాలనలో మహిళలకు రూ.5వేల కోట్ల నిధుల విడుదలకు ఆమోదం**

**ఇందనరంగంలో భారీ పెట్టుబడులకు ఆమోదంయూనివర్శిటీ ఉద్యోగులకు గుడ్ న్యూస్- వయోపరిమితి పెంపు**



తాడేపల్లి జనవరి 31 ( విభారె) ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలపై చర్చించి ఆవెూదించారని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తెలిపారు. అమరావతిలోని సచివాలయం మొదటి బ్లాక్‌లో జరిగిన మంత్రిమండలి సమావేశంలో పలు కీలక అంశాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు జగన్ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పిందని మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని 6,100 పోస్టులతో డీఎస్సీ నిర్వహణకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. అదే విధంగా స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశంలో ఆమోదించిన తీర్మానాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని ఇంధన రంగంలో రూ. 22 వేల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. పలు కీలక అంశాలకు ఆమోదం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు గ్రీన్‌సిగ్నల్ 6,100 పోస్టులతో డీఎస్సీ నిర్వహణకు కేబినెట్ ఆమోదం వైయస్సార్ చేయూత 4వ విడతకు ఆమోదం ఫిబ్రవరిలో వైయస్సార్ చేయూత నిధులు విడుదల ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ మహిళలకు రూ.5వేల కోట్ల నిధుల విడుదలకు ఆమోదం ఎస్ఐపీబీ ఆమోదించిన తీర్మానాలకు గ్రీన్ సిగ్నల్ ఇంధన రంగంలో 22 వేల కోట్ల పెట్టుబడుల ప్రాతిపాదనలకు ఆమోదం అందులో భాగంగా నంద్యాల కర్నూలు జిల్లాల్లో రెండు విండ్ పవర్ ప్రాజెక్టులకు ఆమోదం. శ్రీసత్యసాయి అనంతపురం జిల్లాల్లో 600 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్ట్‌ల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం ప్రతి గ్రామ పంచాయతీకి పంచాయతీ సెక్రటరీ ఉండాలన్న నిర్ణయానికి ఆమోదం ఎస్ఈఆర్టీలోకి ఐబీ భాగస్వామ్యానికి కేబినెట్ ఆమోదం యూనివర్శిటీలు ఉన్నత విద్యా సంస్థల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది పదవీ విరమణ వయసు 60 నుంచి 62కు పెంపు అటవీశాఖలో 689 పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం ఆర్జేయూకేటీకి రిజిస్ట్రార్ పోస్టు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం ఆ మేరకు చట్టంలో సవరణకు కేబినెట్ ఆమోదం

# చంద్రుడి దక్షిణధ్రువంపై దిగిన తొలి దేశంగా భారత్ రికార్డు: రాష్ట్రపతి



ఢిల్లీ:( విభారె), )ఆదిత్య ఎల్-1 మిషన్‌ను భారత్ దిగ్విజయంగా ప్రయోగించిందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తెలిపారు. భూమి నుంచి 15 లక్షల కిలో మీటర్ల దూరంలో ఉన్న కక్షలోకి ఆదిత్య ఎల్-1 ప్రవేశించిందని ప్రశంసించారు. చంద్రుడి దక్షిణధ్రువంపై దిగిన తొలి దేశంగా భారత్ రికార్డు సృష్టించింద న్నారు. దేశంలో 5జీ నెట్ వర్క్ వేగంగా విస్తరిస్తోందన్నారు. జి20 సమావే శంలో భారత్ విజయవంతంగా నిర్వహించిందని కొనియాడారు. కొత్త పార్లమెంటు భవనంలో తొలిసారి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగించారు. కొత్త పార్లమెంటులో తన తొలి ప్రసంగం అని తెలిపారు. రక్షణ రంగం, అంతరిక్ష రంగంలో కొత్త ఆవిష్కరణలు జరిగాయన్నారు. నారీశక్తి వందన్ అధినీయం బిల్లును ఆమోదించుకున్నామని, నారీ శక్తి వందన్ అధినీయం చట్టం ద్వారా చట్టసభల్లో మహిళలకు 33 శాతం స్థానాలు కేటాయించామని ఆమె చెప్పారు. ఆసియా క్రీడల్లో భారత్ తొలిసారిగా 107 పతకాలు గెలుచు కుందని, ఆసియా పారా క్రీడల్లో కూడా భారత్ 111 పతకాలు సాధించిందని ముర్ము ప్రశంసించారు. భారత్‌లో తొలిసారిగా నమోభారత్ రైలును ఆవిష్కరించామని, పేదరిక నిర్మూలనే ప్రధాన లక్షంగా భారత్ ముందు కెళ్తోందని స్పష్టం చేశారు. తెలంగాణలో సమ్మక్క-సారక్క గిరిజన వర్సిటీ ఏర్పాటుకానుందని, అయోధ్యలో రామమందిర నిర్మాణా నికి అన్ని అటంకాలు అధిగమించామని, ఎన్నో ఏళ్ల భారతీయకల?రామమందిర నిర్మాణం సాకారమైందని ముర్ము పేర్కొన్నారు. దేశంలో కొత్త క్రిమినల్ చట్టాన్ని తీసుకొచ్చామని, ఏక భారత్ శ్రేష్ట్ భారత్ నినాదంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాంకింగ్ వ్యవస్థలో భారత్ ఒకటి అని, ఆత్మనిర్భర భారత్, మేక ిన్‌ఇండియామనబలాలురూ. 4 లక్షల కోట్లు వెచ్చించి దేశమంతా తాగునీటి వసతికల్పిస్తున్నామని, ఉజ్వల కనెక్షన్లు పది కోట్లు దాటాయని వివరించారు.

# కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాకనే పూర్తిస్థాయి బడ్జెట్

**పాతపద్దతినే తాము కొనసాగిస్తున్నాం**

**అభివృద్ధి చెందుతున్న దేశానికి అనుగుణంగా బడ్జెట్**

**మీడియా సమావేశంలో వెల్లడించిన ప్రధాని మోడీ**

న్యూఢిల్లీ,జనవరి31 ( విభారె) : కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పూర్తి స్థాయి బ్జడెట్ ను ప్రవేశపెడతామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతుండటం, ఇది ఎన్నికల సంవత్సరం కావడంతో ఈసారి మధ్యంతర బడ్జెట్ సమర్పణ ఉంటుంది. ఎన్నికల్లో గెలుపొంది అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్ ను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1వ తేదీన తాత్కాలిక బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి రంగం సిద్ధమైంది. బడ్జెట్‌కు ముందు రోజు లోక్‌సభలో ప్రవేశపెట్టాల్సిన ఎకనామిక్ సర్వేను ఈసారి ఎన్నికల సంవత్సరం కావడంతో సభలో ప్రవేశపెట్టడం లేదు. బుధవారంనాడు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం చేయడంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభ మయ్యాయి. తాత్కాలిక బడ్జెట్లో ప్రధానంగా మహిళా రైతులకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద ఇచ్చే నగదు సాయాన్ని కేంద్రం రెట్టింపు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. బడ్జెట్ సమావేశాల అనంతరం ఏ క్షణమైనా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించే వీలుంది. బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అవుతున్న క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్ ముందు మీడియాతో మాట్లాడారు. పద్దు ఎలా ఉండబోతోందో వెల్లడించారు. భారత్ రోజురోజుకీ అభివృద్ధి దిశగా ముందడుగు వేస్తోందని, ఈ




మధ్యంతర బడ్జెట్ అందుకు తగ్గట్టుగానే ఉంటుందని తెలిపారు. ప్రజల ఆశీర్వాదాలతో ఈ ప్రయాణం ఇలాగే కొనసాగుతుందని స్పష్టం చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక పూర్తి స్థాయిబడ్జెట్‌ని ప్రవేశపెట్టే సంప్రదాయాన్నీ తాము అనుసరిస్తామని వివరించారు.

# ఏపీ విద్యావ్యవస్థలో విప్లవాత్మక ఘట్టం..

**ప్రభుత్వ బడుల్లో 'ఐబీ' విద్య**

**అమలుకు ఒప్పందం**





గుంటూరు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యా విధానంలో మరో విప్లవాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ప్రభుత్వ పాఠశాలల్లో 'ఐబీ' విద్య అమలుకు శ్రీకారం చుట్టింది జగనన్న ప్రభుత్వం. ఈ క్రమంలో.. సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో ాఅఇఖీ, ఎః మధ్య ఒప్పందం కుదిరింది. తద్వారా దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రైవేటు పాఠశాలల్లో శ్రీమంతుల పిల్లలు చదువుకునే 'ఇంటర్నేషనల్ బాకలారియెట్' (ఐబీ) సిలబస్ పేద పిల్లలకు చేరువ కానుంది. ఐబీ సిలబస్ అమలుపై బుధవారం సాయంత్రం ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్సీఈఆర్టీ) అధికారులతో ఐబీ ప్రతినిధులు సీఎం జగన్ సమక్షంలో ఏపీ విద్యాశాఖతో ఒప్పందం చేసుకున్నారు. ఏపీ పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, ఐబీ చీఫ్ ఎడ్యుకేషన్ ఆఫీసర్(డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్నోవేషన్) డాక్టర్ అంటోన్ బిగిన్ ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఇక ఈ కార్యక్రమానికి ఐబీ డైరెక్టర్ జనరల్ ఒల్లి పెక్క హీనోనెన్ జెనీవా నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ ఒప్పందం ప్రకారం.. 2024 - 25 విద్యా సంవత్సరంలో ఐబీ బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. వారిలో బోధన సామర్థ్యం, నైపుణ్యం పెంచేలా ఈ శిక్షణ ఉంటుంది. టీచర్లతో పాటు మండల,్ నెట్‌వర్క్‌లో భాగమవుతారు. 2025 జూన్ నుంచి ఒకటో తరగతిలో ఐబీ సిలబస్ బోధన ప్రారంభమవుతుంది. ఏటా ఒక్కో తరగతికి ఈ సిలబస్‌ను పెంచుతూ 2035 నాటికి 10వ తరగతి, 2037కి 12వ తరగతిలో అమలు చేస్తారు. పరీక్షల అనంతరం ఐబీ బోర్డు, ఏపీఎస్సీఈఆర్టీ ఉమ్మడిగా సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తాయి. ఈ సర్టిఫికెట్‌కు అంతర్జాతీయంగా గుర్తింపు సైతం ఉంటుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, సీఎస్ డాక్టర్ కె ఎస్ జవహర్‌రెడ్డి, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్ కుమార్, ఇంటర్ మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ సౌరవ్ గౌర్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్(పాఠశాల మౌలిక సదుపాయాలు) కాటమనేని భాస్కర్, సర్వశిక్ష అభియాన్ ఎస్‌పీడీ బి శ్రీనివాసరావు, పాఠశాల విద్యాశాఖ(మిడ్ డే మీల్స్) డైరెక్టర్ ఎస్.ఎస్. శోభికా, ఐబీ ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియంత్రణకు హోంగార్డులను వినియోగించుకోవాలి : సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ ( విభారె) : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణను పోలీస్ విభాగం అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలి. ట్రాఫిక్ సిబ్బంది కొరతను అధిగమించేందుకు వెంటనే తగినంత మంది హోంగార్డుల నియామకాలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డిఅధికారులను ఆదేశించారు. మూడు నెలల్లోగా ఈ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్ ట్రాఫిక్‌పై బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో బుధవారం సీఎం సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..వివిధ విభాగాల్లో పని చేస్తున్న హోంగార్డులను వెంటనే ట్రాఫిక్ విభాగానికి తిరిగి రప్పించాలి. వెంటనే ట్రాఫిక్ నియంత్రణ విధులకు వారి సేవలను వాడుకోవాలని సూచించారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో లా అండ్ ఆర్డర్ పోలీసులను గ్రేటర్ సిటీ ట్రాఫిక్ కంట్రోల్ విధులకు వినియోగించుకోవాలన్నారు. ఇప్పుడున్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల స్థాయిని అప్ గ్రేడ్ చేయాలి. సరిపడే సంఖ్యలో సిబ్బంది ఉండేలా స్టేషన్లను పునర్వ్యవస్థీకరించాలని ఆదేశించారు. రద్దీ ఎక్కువగా ఉండే జంక్షన్లలో ఎల్బీ నగర్ జంక్షన్ తరహాలో సబ్ వే, అండర్ పాస్, సర్ఫేస్ వే నిర్మాణాలు చేపట్టే అవకాశాలు పరిశీలించాల న్నారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కేవలం ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థ మీద ఆధారపడకుండా ట్రాఫిక్ సిబ్బంది అక్కడ ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు పోలీస్ అధికారులు, మున్సిపల్ జోనల్ కమిషనర్లు సమన్వయంతో ట్రాఫిక్ పేర్కొన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా గ్రేటర్ సిటీలో ట్రాఫిక్ నియంత్రణ, నిర్వహణపై సమగ్ర ప్రణాళికను రూపొందించాలి. కన్సలెన్సీలకు బాధ్యతలు అప్పగించి ప్రత్యేకంగా అధ్యయనం చేయించాలని అధికారులను ఆదేశించారు.



# సంపాదకీయం

గురువారం 01-02-2024

## ఇద్దరు న్యాయమూర్తులు... విభిన్న తీర్పులు

న్యాయమూర్తులు పరస్పర వ్యక్తిగత వ్యతిరేక దృష్టితో తీర్పులు ఇచ్చారనే అభిప్రాయానికి తావిచ్చి వివాదాస్పదులు కావడం అరుదైన విషయం. ఇటువంటి సందర్భాలు ఎదురైనప్పుడు వారి మధ్య న్యాయం బలి కాకుండా చూసుకోవలసి ఉంది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏను ఈ కేసులో చంద్రబాబుకు అన్వయించే విషయంలో తమ మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయని ధర్మాసనంలోని జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేది ప్రకటించారు. తగిన నిర్ణయం కోసం కేసును ప్రధాన న్యాయమూర్తికి నివేదిస్తున్నామని వారు చెప్పారు. తనపై ఎఫ్ఆర్‌ను కొట్టివేయాలన్న దరఖాస్తును సెప్టెంబరు 22న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టివేయడంతో చంద్రబాబు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్ఎల్‌పీ)పై ధర్మాసనంలోని జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేది వేర్వేరు తీర్పులు ఇచ్చారు. చంద్రబాబు ప్రస్తుతం బెయిలుపై ఉన్నారు. అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 17ఏ ప్రకారం గవర్నర్ అనుమతి తీసుకోవాల్సి ఉందని, కానీ ప్రభుత్వం తీసుకోలేదని, అందువల్ల ఈ కేసులో మాజీ సీఎం చంద్రబాబును నిందితుడిగా చేర్చలేరని ఆయన తరపు న్యాయవాదులు వాదించారు. సెక్షన్ 17ఏ చంద్రబాబుకు వర్తిస్తుందని జస్టిస్ అనిరుద్ధ బోస్ అభిప్రాయపడగా, జస్టిస్ బేలా త్రివేది విభేదించారు. అవినీతి నిరోధక చట్టం-1988లోని సెక్షన్ 17ఏ పిటిషనర్‌కు అన్వయిస్తుందా లేదా అనే విషయంలోవిషయంలో మాకు భిన్నమైన అభిప్రాయాలు ఉన్నందున, ఈ విషయంలో తగు ఆదేశాల కోసం ప్రధాన న్యాయమూర్తికి నివేదిస్తున్నాం" అని జస్టిస్ అనిరుద్ధ బోస్ చెప్పారు. కలకత్తా హైకోర్టులోని ఇద్దరు న్యాయమూర్తుల మధ్య ఒక కేసులో ఇప్పుడు చోటు చేసుకొన్న వివాదంలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవలసి వచ్చింది. వీరిలో ఒకరు ఏక న్యాయమూర్తి ధర్మాసనానికి చెందినవారు కాగా, మరొకరు డివిజన్ బెంచ్‌లోని వారు. కింది ధర్మాసనం ఇచ్చిన తీర్పును పై బెంచ్ కొట్టివేయడమో లేక దానిపై స్టే ఇవ్వడమో మామూలుగా జరిగేదే. కాని సాటి న్యాయమూర్తి పాలక రాజకీయ పార్టీకి మేలు చేయడానికి పని చేస్తున్నారని మరో న్యాయమూర్తి వ్యాఖ్యానించడమే ఇందులోని విపరీతాంశం. పశ్చిమ బెంగాల్‌లోని వైద్య కళాశాలల్లో ప్రవేశం కోసం గిరిజనులంటూ నకిలీ కులధ్రువీకరణ పత్రాలను విరివిగా ఇస్తున్నారని కలకత్తా హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. చాలా మంది ఈ సర్టిఫికేట్‌లను తీసుకొంటున్నారని అందు లో ఆరోపించారు. ఈ కేసును విచారణకు తీసుకొన్న న్యాయమూర్తి అభిజిత్ గంగోపాధ్యాయ రాష్ట్ర పోలీసులనే కాకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా విమర్శించారు. అదే సమయంలో సిబిఐ దర్యాప్తుకి ఆదేశించారు. దీని మీద పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం జస్టిస్ సౌమెన్ సేన్ అధ్యక్షతన గల డివిజన్ బెంచ్‌ని ఆశ్రయించింది. సిబిఐ దర్యాప్తుకు ఆదేశించిన సింగిల్ జడ్జి తీర్పుపై జస్టిస్ సేన్ స్టే ఉత్తర్వులు జారీ చేశారు. దానితో సిబిఐ దర్యాప్తు చేపట్టాల్సిందేనని జస్టిస్ గంగోపాధ్యాయ ఆదేశించారు. జస్టిస్ సేన్ రాష్ట్రాన్ని పాలిస్తున్న రాజకీయ పార్టీని(తృణమూల్ కాంగ్రెస్) కాపాడాలని చూస్తున్నారని వ్యాఖ్యానించారు. ఆయన అక్రమంగా వ్యవహరిస్తున్నారని నిందించారు. తాను ఇచ్చిన సిబిఐ ఉత్తర్వుల ప్రతిని భారత ప్రధాన న్యాయమూర్తికి, కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పంపించాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించారు. డివిజన్ బెంచ్ స్టే పై సింగిల్ జడ్జి జోక్యం చేసుకొని తన ఆదేశాలే చెల్లాలని తాజా ఉత్తర్వులు జారీ చేయడం అరుదైన పరిణామం. అంతేకాకుండా డివిజన్ బెంచ్ న్యాయమూర్తిపై రాజకీయ పక్షపాత ఆరోపణలు చేయడం ప్రత్యేకించి ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. జస్టిస్ సేన్ సొంత ప్రయోజనాల కోసం పాలక పక్షానికి మేలు చేయదలిచారని, తాను చెప్పినట్టు నడుచుకోవాలని డివిజన్ బెంచ్‌లోని మరో న్యాయమూర్తిని బెదిరించారని కూడా జస్టిస్ గంగోపాధ్యాయ ఆరోపించడం గమనార్హం. దీని వెనుక వ్యక్తిగత కక్ష ఏమైనా ఉందా అనే అనుమానం కలగడం సహజం. అయినా న్యాయ వ్యవస్థలో గల అంచెల ఏర్పాటులో పై ధర్మాసనాలకు, సుప్రీం కోర్టుకి కూడా వెళ్లే అవకాశాలున్నాయి. అందుచేత జస్టిస్ గంగోపాధ్యాయ ఇంతగా నిగ్రహం కోల్పోవడం అవసరమా? ఉన్నత న్యాయస్థానాల న్యాయమూర్తులు పాలకుల ప్రయోజనాలకు అనువుగా తీర్పులు చెప్పడం అరుదుగానైనా జరుగుతున్నదా అనే అనుమానమూ కలుగుతున్నది. గతంలో ఒకసారి అక్రమ కట్టడాల కూల్చివేతలకు సంబంధించిన కేసులో కలకత్తా నగరమంతా అక్రమ నిర్మాణాలు వెలిశాయని, అవసరమనుకుంటే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నుంచి అద్దెకు బుల్డోజర్లు తెచ్చుకోండి అని అక్కడి మునిసిపల్ అధికారులను ఉద్దేశించి గంగోపాధ్యాయ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. ఆయన సరదాకే అలా వ్యాఖ్యానించారని గంగోపాధ్యాయ తరపున వివరణ వచ్చినప్పటికీ అది రాజకీయ వర్గాల్లో తీవ్రమైన సంచలనం సృష్టించింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రస్తుత కేసులో జస్టిస్ సేన్‌పై జస్టిస్ గంగోపాధ్యాయ చేసిన వ్యాఖ్యలను గమనంలోకి తీసుకొన్న సిజెఐ తన సారథ్యంలోనే ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనాన్ని ఏర్పాటు చేసి ఈ ఉదంతాన్ని ప్రత్యేక విచారణకు స్వీకరించారు. రెండు బెంచీలు ఎటువంటి తదుపరి చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేశారు. ఈ ధర్మాసనం విచారణను 29 తేదీ సోమవారం నాటికి వాయిదా వేసింది.

# ఆసరా తో ప్రతి మహిళ ఆర్థిక అభివృద్ధి

### మెప్మా సీఎం ఎం విజయ భాస్కర్ రెడ్డి

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 31- బుధవారం నాడు నంద్యాల పట్టణము నందు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) వారి ఆధ్వర్యము నందు 37-31-40-21- వార్డుల యందు వైయస్సార్ ఆసరా 4వ విడత సంబరాలు ఘనంగా నిర్వహించారు. కౌన్సిలర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం లో వైస్ చైర్మన్ మరియు కౌన్సిలర్ లు మాట్లాడుతూ జగనన్న ఇచ్చిన మాట మేరకు నాలుగో విడత ఆసరా అమౌంట్ సంబంధిత సంఘాలకు విడుదల చేయడం జరుగుతుంది అని తెలియజేసారు. మహిళా అభివృద్ధి ద్వారానే మన కుటుంబ అభివృద్ధి జరుగుతుందని గట్టిగా నమ్మిన వ్యక్తి జగనన్న, ప్రభుత్వ పథకాలలో మహిళలకు పెద్దపీట వేస్తూ, నామినేషన్ పోస్టులలో మరియు నామినేటెడ్ పనులలో చట్టం చేసి 50 శాతం మహిళల కేటాయించిన ఘనత మన జగనన్నకు మాత్రమే సాధ్యం అని





తెలియజేసారు. మన ప్రభుత్వం ద్వారా పొందే లబ్ధితో మీ జీవనోపాదులు మెరుగుపరుచుకొని తద్వారా కుటుంబ ఆదాయ వనరులు పెంచుకోవాలన్నారు . ఈ కార్యక్రమం లో వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్. రాష్ట్ర దృశ్య కళల డైరక్టర్ సునీత. సంబంధిత వార్డు కౌన్సిలర్ శ్రీమతి అనురాధ. శ్రీమతి సంజీద వార్డు ఇన్చార్జి అమృత రాజ్. మునయ్య , మెప్మా సీఎంఎం విజయ భాస్కర్ రెడ్డి, సి.ఓలు ఆర్.పి లు మరియు పొదుపు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తగ్గని గోల్డ్ రష్...



ముంబై, జనవరి 31అమెరికాలో వడ్డీ రేట్లను నిర్ణయించే యూఎస్ ఫెడ్ మీటింగ్ ప్రారంభమైన నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి ధర బాగా పెరిగింది. ప్రస్తుతం, ఔన్స్ (28.35 గ్రాములు) బంగారం ధర 2,051 డాలర్ల వద్ద ఉంది. మన దేశంలో 10 గ్రాముల ఆర్నమెంట్ బంగారం (22 కేరెట్లు) ధర 200 రూపాయలు, స్వచ్ఛమైన పసిడి (24 కేరెట్లు) ధర 220 రూపాయలు, 18 కేరెట్ల గోల్డ్ రేటు 160 రూపాయల చొప్పున పెరిగాయి. కిలో వెండి రేటు ? 300 ఎగబాకింది. తెలంగాణలో బంగారం, వెండి ధరలుహైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర ? 58,000 వద్దకు; 24 క్యారెట్ల బంగారం ధర ? 63,270 వద్దకు; 18 క్యారెట్ల బంగారం ధర ? 47,450 వద్దకు చేరింది. కిలో వెండి ధర హైదరాబాద్ మార్కెట్‌లో ? 78,000 గా ఉంది. ఏపీ, తెలంగాణవ్యాప్తంగా ఇదే ధర అమల్లో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో బంగారం, వెండి ధరలువిజయవాడలో 10 గ్రాముల 22 క్యారెట్ల ఆర్నమెంటు బంగారం ధర ? 58,000 వద్దకు; 24 క్యారెట్ల బంగారం ధర ? 63,270 వద్దకు; 18 క్యారెట్ల బంగారం ధర ? 47,450 వద్దకు చేరింది. ఇక్కడ కిలో వెండి ధర ? 78,000 గా ఉంది. విశాఖపట్నం మార్కెట్‌లో బంగారం, వెండికి విజయవాడ రేటే అమలవుతోంది. ధరల్లో మార్పులు ఎందుకు?పసిడి, వెండి, ప్లాటినం సహా అలంకరణ లోహాల ధరలు ప్రతిరోజూ మారుతుంటాయి. ప్రపంచవ్యాప్తంగా జరిగే అనేక పరిణామాల మీద ఈ మార్పులు ఆధారపడి ఉంటాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరగడం లేదా తగ్గడం వల్ల మన దేశంలో ధరలు మారుతుంటాయి. ప్రపంచ మార్కెట్‌లో అలంకరణ లోహాల రేట్లు పెరగడానికి, తగ్గడానికి చాలా కారకాలు పని చేస్తాయి. ద్రవ్యోల్బణం, ప్రపంచ కేంద్ర బ్యాంకుల వద్ద బంగారం నిల్వలు, వడ్డీ రేట్ల పెరుగుదల లేదా తగ్గుదల, వివిధ జ్యువెలరీ మార్కెట్లలోని డిమాండ్‌లో హెచ్చుతగ్గులు వంటి ఎన్నో అంశాలు అలంకరణ లోహాల ధరలను ప్రభావితం చేస్తాయి

# ఇవాల్టి నుంచి కొత్త రూల్స్...

ముంబై, జనవరి 31క్యాలెండర్‌లో కొత్త నెల ప్రారంభం కాగానే, దేశవ్యాప్తంగా కొన్ని కొత్త రూల్స్ అమల్లోకి వస్తుంటాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నెల నుంచి కూడా కొన్ని విషయాలు మారతాయి. వాటిలో.. కేంద్ర బడ్జెట్, ఔఖూ విత్‌డ్రా రూల్, సావరిన్ గోల్డ్ బాండ్ పథకం, స్టేట్ బ్యాంక్ హోమ్ లోన్ ఆఫర్ సహా చాలా విషయాలు ఉన్నాయి. ఈ మార్పులు మీ పొదుపు, పెట్టుబడులు, ప్రయోజనాల మీద ప్రభావం చూపొచ్చు. మీ ఇంటి బడ్జెట్‌ను పెంచొచ్చు. వాటి గురించి ముందే తెలుసుకుంటే, మీ పర్స్‌కు చిల్లు పడకుండా అడ్డుకోవచ్చు.

ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్: మోదీ 2.0 హయాంలోని చివరి బడ్జెట్ ఇది. ఇది మధ్యంతర బడ్జెట్ అయినా, రాబోయే ఎన్నికల దృష్ట్యా కొన్ని ప్రోత్సాహక ప్రకటనలు చేసే అవకాశం ఉంది. లేదా.. తాము మళ్లీ అధికారంలోకి వస్తే, జులైలో ప్రవేశపెట్టే సమగ్ర బడ్జెట్‌లో కురిపించే వరాల గురించి హింట్స్ అయినా ఇచ్చే ఛాన్స్ ఉంది. గత కొన్నేళ్లుగా మూలధన వ్యయం కోసం భారీగా కేటాయింపులు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం, ఈసారి కూడా అదే పంథా కొనసాగించవచ్చని నిపుణులు భావిస్తున్నారు. దేశ జనాభాలో మెజారిటీ వర్గమైన మధ్య తరగతి ప్రజలు, ముఖ్యంగా మహిళలను దృష్టిలో పెట్టుకుని కొత్త రాయితీలను ప్రకటించవచ్చని అంచనా వేస్తున్నారు.

సావరిన్ గోల్డ్ బాండ్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, 2023-24 సావరిన్ గోల్డ్ బాండ్ సిరీస్‌లో చివరి విడతను ఫిబ్రవరిలో ప్రకటిస్తుంది. దీని సబ్‌స్క్రిప్షన్ 2024 ఫిబ్రవరి 12న ఓపెన్ అవుతుంది, అదే నెల 16న ముగుస్తుంది. దీనికి ముందు విడత 2023 డిసెంబర్‌లో జరిగింది. అప్పుడు, బంగారం ధరను గ్రాముకు రూ.6,199గా కేంద్ర బ్యాంక్ నిర్ణయించింది. ఫిబ్రవరి సిరీస్‌లో గ్రాము ధరను అతి త్వరలో ప్రకటిస్తారు.

ఔఖూ డబ్బు విత్‌డ్రా నిబంధన పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ, ఈ మధ్యే ఒక సర్క్యులర్ విడుదల చేసింది. ఔఖూ అకౌంట్ నుంచి కొంత డబ్బు విత్‌డ్రా చేసుకోవడానికి కొత్త రూల్ జారీ చేసింది. ఫిబ్రవరి 01 నుంచి కొత్త రూల్ అమల్లోకి వస్తుంది. దీని ప్రకారం... ఔఖ అకౌంట్‌లో ఉన్న డబ్బులో యజమాన్యం వాటాను మినహాయించి, చందాదార్లు కట్టే వాటా నుంచి మాత్రమే విత్‌డ్రా చేసుకోవచ్చు. అది కూడా 25 శాతం ఉపసంహరణకు మాత్రమే అనుమతి ఉంటుంది.

ఫాస్టాగ్ కేవైసీ కేవైసీ లేని అన్ని ఫాస్టాగ్‌లు ఫిబ్రవరి 01 నుంచి డీయాక్టివేట్ అవుతాయి. అంటే, జనవరి 31 లోగా యూజర్లు తమ ఫాస్టాగ్ కేవైసీని పూర్తి చేయాలి. ఫాస్టాగ్‌కు అనుసంధానమైన మీ బ్యాంక్ అకౌంట్‌లో డబ్బున్నా, కేవైసీకి ఈ-కేవైసీ చేయకపోతే అవి పని పని చేయవు.

స్టేట్ బ్యాంక్ హోమ్ లోన్ ఆఫర్: దేశంలో అతి పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ ూఃఎ, క్రెడిట్ స్కోర్ ఆధారంగా గృహ రుణాలపై రాయితీ ఇస్తోంది. 650 ఎజూబ కంటే ఎక్కువ క్రెడిట్ స్కోర్ ఉన్న వ్యక్తులకు తక్కువ వడ్డీ రేట్లకు హౌసింగ్ లోన్ మంజూరు చేస్తోంది. హోమ్ లోన్ మీద ప్రాసెసింగ్ ఫీజు, రాయితీలకు చివరి తేదీ 31 జనవరి 2024. ధన్ లక్ష్మి ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకం పంజాబ్ ఢ సింధ్ బ్యాంక్ (ఖూః) అమలు చేస్తున్న 'ధన్ లక్ష్మి 444 డేస్' ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకం చివరి తేదీ జనవరి 31, 2024. పేరుకు తగ్గట్లే ఈ టర్మ్ డిపాజిట్ కాల వ్యవధి 444 రోజులు. వడ్డీ రేటు 7.4%. సూపర్ సీనియర్లు 8.05% తీసుకోవచ్చు..

## మద్యం కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు ఐదోసారి ఈడీ నోటీసులు



ముంబై, జనవరి 31 ,మద్యం కుంభకోణం కేసు లో ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ (ంంఖ) అధినేత అరవింద్ కేజ్రీవాల్ కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌అధికారులు మరోసారి సమన్లు జారీ చేశారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో కేజ్రీవాల్‌కు ఈడీ అధికారులు ఇప్పటికే నాలుగు సార్లు సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆయన ఒక్కసారి కూడా విచారణకు హాజరు కాలేదు. దీంతో తాజాగా ఐదోసారి ఈడీ సమన్లు పంపింది. ఫిబ్రవరి 2న విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. గతంలో నవంబర్ 2న, డిసెంబర్ 21న, ఆ తర్వాత జనవరి 3న కేజ్రీవాల్‌కు ఈడీ అధికారులు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ తర్వాత జనవరి 13వ తేదీన కూడా నాలుగోసారి విచారణకు హాజరు కావాలని నోటీసులు పంపింది. కానీ, నాలుగు సార్లూ ఈడీ నోటీసుల్ని కేజ్రీవాల్ పట్టించుకోలేదు. ఈడీ నోటీసులు అక్రమమంటూ కొట్టిపారేశారు. తనను అరెస్ట్ చేసే కుట్రలో భాగంగానే నోటీసులు పంపుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి ఈడీ నోటీసులు జారీ చేసింది. తాజా నోటీసులపై సీఎం ఇంకా స్పందించలేదు.

## జార్ఖండ్ వెళ్లాల్సిన ఇండిగో విమానం రద్దు.. ప్రయాణికులు ఆగ్రహం



న్యూఢిల్లీ: జార్ఖండ్‌కు వెళ్లాల్సిన ఇండిగో విమానం రద్దైంది. దీంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎయిర్‌పోర్ట్‌లో నిరసనకు దిగారు. ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశ రాజధాని ఢిల్లీ విమానాశ్రయంలో ఈ సంఘటన జరిగింది. ఇండిగో విమానం 6ఈ 2198 ఢిల్లీ నుంచి జార్ఖండ్‌లోని డియోగఢ్‌కు బుధవారం తెల్లవారుజామున వెళ్లాల్సి ఉంది. అయితే ఆ విమానాన్ని ఆ సంస్థ రద్దు చేసింది. దీంతో విమాన ప్రయాణికులు ఢిల్లీ విమానాశ్రయంలో ఆందోళనకు దిగారు. ఇండిగో విమానాన్ని రద్దు చేయడంపై నిరసన వ్యక్తం చేశారు. 'ఇండిగో చోర్ హై, బంద్ కరో' అంటూ నినాదాలు చేశారు. దీంతో ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో గందరగోళం చెలరేగింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కాగా, విమానం రద్దుపై ఇండిగో సంస్థ వివరణ ఇచ్చింది. వాతావరణ పరిస్థితులు, నియంత్రణకు మించిన కారణాల వల్ల ఢిల్లీ-డియోగఢ్ విమానాన్ని రద్దు చేసినట్లు తెలిపింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్లు పేర్కొంది. విమాన ప్రయాణికులకు పూర్తి రీఫండ్, ప్రత్యామ్నాయ మార్గాలు లేదా రీషెడ్యూలింగ్ పొందే ఆప్షన్లు ఇవ్వడంతోపాటు రిఫ్రెష్‌మెంట్లు అందించినట్లు వెల్లడించింది. మరోవైపు ఢిల్లీలో దట్టమైన మంచు వల్ల వాతావరణం అనుకూలించకపోవడంతో బుధవారం ఢిల్లీ విమానాశ్రయంలో సుమారు పది విమానాలు రద్దయ్యాయి. అలాగే 50కుపైగా విమానాల రాకపోకల్లు ఆలస్యమయ్యాయి.

## ఇక నో యూటర్న్..ఎప్పటికీ ఎన్డీయే కూటమిలోనే కొనసాగుతా : నితీష్ కుమార్

ఇక ఎప్పటికీ ఎన్డీయే కూటమిలో కొనసాగుతూ రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని బిహార్ సీఎం నితీష్ కుమార్ బుధవారం పేర్కొన్నారు. మహాకూటమి నుంచి బయటపడి బీజేపీ మద్దతుతో బిహార్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేసిన అనంతరం నితీష్ కుమార్ ఈ వ్యాఖ్యలు చేశారు. విపక్ష కూటమికి మరో పేరు ఎంచుకోవాలని తాను కోరినా ఇండియా పేరును ఖరారు చేశారని నితీష్ ఆరోపించారు. ఇప్పటివరకూ లోక్‌సభ ఎన్నికల్లో ఏ పార్టీ ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని వారు నిర్ణయించుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. దీంతో తాను విపక్ష కూటమిని వీడి గతంలో తన ప్రయాణం సాగించిన వారి పక్షానికి చేరుకున్నానని, ఇక ఇప్పటినుంచి ఎన్డీయే కూటమిలోనే ఎప్పటికీ కొనసాగుతామని స్పష్టం చేశారు.ః బిహార్ ప్రజల అభివృద్ధి కోసం

# తలనొప్పిగా మారిన స్థానాలు

విజయవాడ, జనవరి 31ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల కోసం అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దూకుడుగా వెళ్తోంది. నెల రోజులుగా నియోజకవర్గాల వారీగా ఇంచార్జిల మార్పుపై వైసీపీ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుంది. మరో వైపు ఇప్పటికే ఎన్నికల శంఖారావం కూడా పూరించారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి.బొబ్బిలిలో సిద్ధం సభ ద్వారా సమరశంఖం పూరించారు వైసీపీ అధినేత వైఎస్ జగన్. మరో నాలుగు ప్రాంతాల్లో సభలు పెట్టేందుకు కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో పాగా వేయాలనేదీ ముఖ్యమంత్రి జగన్ టార్గెట్‌గా పెట్టుకున్నారు. దానికి అనుగుణంగానే సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీల స్థానాల్లో మార్పులు చేర్పులు చేస్తున్నారు. కొంత మంది ఎమ్మెల్యేలను ఒకచోట నుంచి మరో చోటుకి మారుస్తున్నారు. మరికొంత మందికి టిక్కెట్లు నిరాకరిస్తున్నారు.ఇక, లోక్ సభ స్థానాల విషయంలో కూడా ఆచితూచి అడుగులు వేస్తున్నారు వైఎస్ జగన్. కొంతమంది ఎమ్మెల్యేలను ఎంపీ అభ్యఃర్థులుగా పంపిస్తున్నారు. మరికొంత మంది ఎంపీలను ఈసారి అసెంబ్లీ నియోజకవర్గాల ఇంచార్జిలుగా నియమించారు. ఆయా అభ్యర్థులపై వచ్చిన సర్వే నివేదికలు, పనితీరు ఆధారంగా ఈ మార్పులు చేస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ప్రకటించింది. స్థానికంగా ప్రజల్లో ఉన్న వ్యతిరేకతతో పాటు పార్టీ కేడర్‌ను కలుపుకునిపోవడంలో విఫలమైన అభ్యర్థుల విషయంలో పార్టీ అధినేత జగన్ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే చాలా చోట్ల అసెంబ్లీతో పాటు పార్లమెంట్ ఇంచార్జిలను కూడా మార్పు చేశారు.ఇప్పటివరకూ మొత్తం నాలుగు జాబితాలు ప్రకటించింది వైఎస్సార్‌సీపీ. మొత్తం 68 స్థానాలకు ఇంచార్జిలను మార్పు చేశారు. వీటిలో 58 అసెంబ్లీ స్థానాలుండగా, మరో 10 ఎంపీ స్థానాలున్నాయి. జనవరి

## ఐదో జాబితాపై కొనసాగుతున్న కసరత్తు

18వ తేదీన నాలుగో విడత జాబితాను ప్రకటించింది వైసీపీ అధిష్టానం. అప్పటి నుంచి ఐదో విడత జాబితాపై పార్టీ పెద్దలు కసరత్తు చేస్తున్నారు. అయితే, కొన్ని స్థానాలకు సంబంధించి అభ్యర్థుల ఎంపికలో వైసీపీ అధిష్టానం తలలు పట్టుకుంటుంది. సామాజిక సమీకరణాలతో పాటు గెలుపు గుర్రాలను ఎంపిక చేయడం పార్టీకి తలనొప్పిగా మారింది. దీంతో ఆయా స్థానాల్లో అభ్యర్థులపై కసరత్తు కొలిక్కి రావడం లేదు. కసరత్తు పూర్తికాకపోవడంతో ఐదో విడత అభ్యర్థుల ప్రకటన రోజురోజుకూ ఆలస్యం అవుతుంది.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిల మార్పులో భాగంగా ఇప్పటివరకూ 58 అసెంబ్లీ స్థానాలతో పాటు 10 లోక్ సభ స్థానాలకు అభ్యర్థులను మార్పు చేశారు. మిగిలిన 13 ఎంపీ స్థానాల్లో మూడు స్థానాల్లో ఎలాంటి మార్పు లేదని తెలుస్తోంది. కడప ఎంపీ అవినాష్ రెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, బాపట్ల ఎంపీ నందిగం సురేష్ స్థానాలు పదిలంగానే ఉన్నాయి. ఇక, మిగిలిన పది స్థానాల అభ్యర్థుల ఎంపిక అధిష్టానానికి తలనొప్పిగా మారింది. వీటిలో ఒకట్రెండు స్థానాలకు క్లారిటీ వచ్చిందని తెలిసింది. మిగిలిన ఏడెనిమిది స్థానాలకు పలువరు పేర్లు పరిశీలనలో ఉన్నప్పటికీ తుది నిర్ణయం ఇంకా తీసుకోలేదు.అలాగే అసెంబ్లీ స్థానాల విషయంలో కూడా కొన్ని మార్పులు చేద్దామనుకున్న స్థానాలను సిట్టింగ్‌లకే ఇచ్చేలా అధిష్టానం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. వీటిలో బొబ్బిలి సిట్టింగ్ ఎమ్మెల్యే అప్పలనాయుడుకు తిరిగి కేటాయించే చాన్స్ ఉంది. ఇక్కడ కొప్పుల వెలమ అభ్యర్థిని రంగంలోకి దించాలని అనుకన్నప్పటికీ సరైన అభ్యర్థి దొరక్కపోవడంతో అప్పలనాయుడును కొనసాగించే అవకాశం కనిపిస్తుంది.

ఇక, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కు తిరిగి ఇదే స్థానం ఖరారయ్యే అవకాశం ఉంది. పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజ్‌కు తిరిగి అక్కడే సీటు కేటాయించే అవకాశం ఉంది.ఇక ఎంపీ స్థానాలకు అభ్యర్థుల ఎంపిక కొలిక్కి రాలేదు. విజయనగరం ఎంపీగా మజ్జి శ్రీను అనుకున్నప్పటికీ ఈయన స్థానంలో చంద్రశేఖర్ పేరు వినిపిస్తుంది. అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా మంత్రి గుడివాడ అమర్నాథ్ పేరు వినపడుతుంది. ఇక కాకినాడ పార్లమెంట్ స్థానానికి చలమలశెట్టి సునీల్ పేరు దాదాపు ఖరారయినట్లేనని తెలుస్తోంది. రాజమండ్రి ఎంపీగా జక్కంపూడి రాజా పేరు పరిశీలించినప్పటికీ వెలమ సామాజిక వర్గం అభ్యర్థి కోసం పలువురు పేర్లు పరిశీలనలో ఉన్నాయి. అమలాపురం ఎంపీగా ఎలీజా అనుకున్నప్పటికీ ఆయన స్థానంలో మరొకరి కోసం అధిష్టానం పెద్దలు వెతుకుతున్నారు.మచిలీపట్నం పార్లమెంట్ ఇంచార్జిగా అవనిగడ్డ సిట్టింగ్ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పేరు పరిశీలనలో ఉంది..గుంటూరు స్థానానికి మేయర్ కావటి మనోహర్ నాయుడు పేరు మొదట్లో పరిశీలించినా, ఆయన వద్దనుకున్నట్లు తెలిస్తోంది. అందుకే మరో బలమైన అభ్యర్థి కోసం అధిష్టానం పలువురి పేర్లను పరిశీలిస్తోంది. నరసరావుపేట ఎంపీగా అనిల్ కుమార్ యాదవ్ దాదాపు ఖరారయినట్లే అని సమాచారం. నంద్యాల టిక్కెట్‌ను మైనార్టీలకు ఇచ్చే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు సమాచారం. ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా మద్దిశెట్టి వేణుగోపాల్ లేదా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి ఇచ్చే అవకాశం ఉన్నట్లు పార్టీ పెద్దల నుంచి అందుతున్న సమాచారం.ఈ స్థానాలపై కసరత్తు కొలిక్కి రావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. ఆ తర్వాతే ఐదో జాబితా విడుదల చేసేలా వైఎస్సార్సీపీ అధిష్టానం ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఇదే జాబితాతో మొత్తం అభ్యర్థుల మార్పులు చేర్పులుకు ఫుల్ స్టాప్ పెట్టనున్నట్లు సమాచారం.

# నగల కోసం వృద్ధురాలి హత్య

నెల్లూరు,ఓ వృద్ధు రాలిని హతమార్చి బంగారు నగలు ఎత్తుకెళ్లిన ఘటన నెల్లూరు జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంగం మండలం తలుపూరు పాడు గ్రామంలో మస్తాన్, మస్తాన్ బి అనే వృద్ధ దంపతులు నివసిస్తున్నారు. వృద్ధుల వద్ద బంగారు నగలు ఉన్నాయని తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన ఆన్సర్ అనే వ్యక్తి ఎలాగైనా వాటిని కొట్టాలని పథకం పన్నాడు. మస్తాన్ కు ఫూల్ గా మద్యం తాగించాడు. తరువాత ఆన్సర్ ఇంట్లోకి వెళ్లి మస్తాన్ బి నిద్రపోతుండగా ముఖం పైన దిండు తో నొక్కి అతి దారుణంగా హత్య చేసాడు. ఇంటిలోని నగలు మొత్తం ఎత్తుకెళ్లిపోయాడు. సాధారణం మరణం అనుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు మస్తాన్ బి అంత్య క్రియలు పూర్తి చేసేసారు. ఈ ఘటన శనివారం జరిగింది. తరువాత మస్తాన్ కి అన్సర్ పైన అనుమానం రావడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆన్సర్ ను అదుపులోకి తీసుకున్న పోలీసులు వృద్ధురాలిది హత్యగానే నిర్ధారించారు

# టీడీపీ గూటికి మరో ఎమ్మెల్యే

తిరుపతి, జనవరి 31, వైసీపీకి మరో ఎమ్మెల్యే ఝలక్ ఇచ్చారు. ఎమ్మెల్యేను తప్పించి ఎంపీగా అవకాశం ఇచ్చినా సదరు నేత పెద్దగా ఆసక్తి చూపలేదు. ఇస్తే ఎమ్మెల్యేఅవకాశం ఇవ్వండి.. లేకుంటే తన దారి తాను చూసుకుంటానని హెచ్చరికలు పంపారు. ఇప్పుడు అనుకున్నంత పని చేశారు. ఎంపీగా అవకాశం ఇచ్చినా తనకు వద్దంటూ టిడిపిలో చేరేందుకు సిద్ధపడ్డారు. దీంతో అధికార వైసిపికి చుక్కెదురు అయ్యింది. ఎంపీగా అవకాశం ఇచ్చినా సదరు నేత మొగ్గు చూపకపోవడంతో వైసిపి నాయకత్వం తల పట్టుకుంటుంది. మొన్న గుమ్మనూరు జయరాం ఇలా చేస్తే.. తాజాగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వైసిపి అగ్రనాయకత్వానికి ఝలక్ ఇచ్చారు.సత్యవేడు ఎమ్మెల్యేగా ఆదిమూలం ఉన్నారు. ఈసారి ఆయనకు తప్పించారు. ఆయన స్థానంలో తిరుపతి ఎంపీ గురుమూర్తికి అవకాశం ఇచ్చారు. ఎంపీ అభ్యర్థిగా కోనేటి ఆదిమూలంను ఎంపిక చేశారు. అయితే తాను ఎంపీగా వెళ్ళనంటూ ఆదిమూలం తేల్చి చెప్పారు. అయినా సరే వెళ్లాల్సిందేనంటూ హై కమాండ్ తేల్చి చెప్పింది. అయితే తన మార్పునకు మంత్రి పెద్దిరెడ్డి కారణమంటూ ఆదిమూలం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి ఆధిపత్యం కొనసాగుతోందని.. పేరుకే తాము ఎమ్మెల్యేలం కానీ.. పెత్తనం పెద్దిరెడ్డిదంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సైకిల్ పై తిరిగే పెద్దిరెడ్డి ఈ స్థాయికి ఎలా వచ్చారో అందరికీ తెలుసునని అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో కోనేటి ఆదిమూలం వైసీపీలో కొనసాగరని తేలిపోయింది.సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం సడన్ గా హైదరాబాదులో ప్రత్యక్షమయ్యారు. కుమారుడుతో కలిసి నారా లోకేష్ ను కలుసుకున్నారు. ఆయనతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. టిడిపిలోకి మారే అంశంపై చర్చించినట్లు తెలుస్తోంది. లోకేష్ తో బేటీ కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గత కొద్ది రోజులుగా ఆదిమూలం మనస్తాపంతో ఉన్నారు. వైసీపీలో ఎంతో నమ్మకంగా పనిచేస్తే.. రాజకీయ భవిష్యత్తు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. వాస్తవానికి వైసిపి తిరుపతి ఎంపీ సీటును ఆఫర్ చేసినా ఆదిమూలం తిరస్కరించారు. సత్యవేడు నియోజకవర్గంలో తాను బాగానే పనిచేశానని.. కేవలం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒత్తిడితోనే తనను మార్చుతున్నారని ఆదిమూలం అనుమానిస్తున్నారు. అందుకే తిరుపతి పార్లమెంట్ స్థానానికి వెళ్లేది లేదని అధిష్టానానికి తేల్చి చెప్పారు. మరోవైపు ఆదిమూలం తీరుపై వైసీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. ఆయన తెలుగుదేశం నేతలతో ముందుగానే మాట్లాడుకున్నారని.. అందుకే ఎంపీ సీటును వదులుకున్నారని చెబుతున్నారు. అయితే టిడిపి సత్యవేడు అసెంబ్లీ సీటు ఇస్తుందా? లేకుంటే ప్రత్యామ్నాయ అవకాశాలు చూపుతోందా? అన్నది తెలియాల్సి ఉంది. దీనిపై ఒకటి రెండు రోజుల్లో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

# విజయవంతంగా ముగిసిన క్రీస్తు సువార్త సభలు



## -ముగింపు సభల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ,గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం ప్రాంగణంలో గత మూడు రోజులుగా విక్టరీ బాప్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రీస్తు సువార్త సభలు మంగళవారం రాత్రితో విజయవంతంగా ముగిసాయి. ముగింపు సభల్లో ఎమ్మెల్యే కొడాలి నాని ముఖ్యఅతిథిగా పాల్గొని క్రైస్తవ విశ్వాసులనుద్దేశించి ప్రసంగించారు. విక్టరీ బాప్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా పెద్ద ఎత్తున జరుగుతున్న సువార్త సభలో పాల్గొనే అదృష్టం కలిగినందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు.ప్రేమ, జాలి, దయ, కరుణ గుణాలకు ప్రతిరూపం క్రైస్తవత్వమని ఎమ్మెల్యే నాని అన్నారు. నిత్యం ఏసు ప్రభువును ప్రార్థించే సీఎం జగన్ రాష్ట్రంలోని పేద వర్గాల ఉన్నతికి ఎంతో శ్రమిస్తున్నారన్నారు. ప్రభు ఆదేశించినట్లు రెండు లక్షల 50వేల కోట్ల నిధులను ప్రభుత్వ ఖజానా నుండి నేరుగా ప్రజలకు అందించిన వ్యక్తి సీఎం జగన్ అని ఎమ్మెల్యే నాని కొనియాడారు. నిత్యం ప్రజల కోసం పరితపించే సీఎం జగన్ కుటుంబానికి ఏసుప్రభు ఆశీస్సులు ఉండాలని ఎమ్మెల్యే కొడాలి నాని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి మతవిశ్వాసాలకు అనుగుణంగా జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆటంకాలు లేకుండా చూడాలని సీఎం జగన్ ప్రభుత్వ యంత్రాంగానికి నేరుగా చెప్పారని ఎమ్మెల్యే కొడాలి నాని తెలియజేశారు. ఇంత పెద్ద ఎత్తున సభలు నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులను ఎమ్మెల్యే కొడాలి నాని అభినందించారు. ప్రార్థనల నిర్వహణకు తమకు ఎన్టీఆర్ స్టేడియం ప్రాంగణాన్ని సమకూర్చడమే కాక, సభల విజయవంతానికి సహకారం అందించిన ఎమ్మెల్యే కొడాలి నానికు నిర్వాహకులు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం విక్టరీ బాప్టిస్ట్ అసోసియేషన్ సభ్యులు, దైవ సేవకులు ఎమ్మెల్యే కొడాలి నానికు ఆత్మీయ సత్కారం చేశారు. తొలుత సభల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే కొడాలి నానికు క్రైస్తవ విశ్వాసులు కరచానాలు చేస్తూ తమ అభివాదాలు తెలియజేశారు. ముగింపు సభల్లో విక్టరీ బాప్టిస్ట్ అసోసియేషన్ కన్వీనర్ పండు మద్దాలి, సభల ఆర్గనైజర్ శ్యాంబాబు, మంద సువర్ణ బాబు, గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ మట్టా నాగమణి జాన్ విక్టర్, వైఎస్ఆర్సిపి రాష్ట్ర నాయకులు వెంపటి సేమన్, క్రిస్టియన్ సెల్ జోనల్ ఇంచార్జ్ కేజే విక్టర్ పాల్, బిషప్ అప్పికట్ల జాషువా, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ పాలేటి చంటి, వల్లురుపల్లి సుధాకర్, రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన దైవ సేవకులు, వేలాదిగా క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

# టీడీపీలో అనంత చిచ్చు...

అనంతపురం, జనవరి 31 అనంతపురం జిల్లాలోనే కాదు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరిటాల కుటుంబం, జేసీ కుటుంబం అంటే తెలియని వారెవరు ఉండరు. మూడు దశాబ్దాల అనంతపురం రాజకీయాల్లో ఈ రెండు కుటుంబాలదీ ప్రత్యేకమైన స్థానం. అయితే రాబోయే ఎన్నికల్లో కుటుంబానికి ఒకటే టికెట్ అన్న సాంప్రదాయాన్ని తెలుగుదేశం పార్టీ తెరమీదకి తీసుకురావడంతో ఈ రెండు కుటుంబాలలో రెండో టికెట్ సంగతి ఏంటీ అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది.రాబోయే ఎన్నికల్లో జేసీ కుటుంబం నుంచి ఇద్దరు అభ్యర్థులు పోటీ చేస్తారని జేసీ ప్రభాకర్ రెడ్డి తేల్చి చెప్పారు. ఇప్పటికే తాడిపత్రి అసెంబ్లీ బరిలో జేసీ ప్రభాకర్ రెడ్డి కుమారుడు జేసీ అస్మిత్ రెడ్డి టికెట్ కన్ఫామ్ అయింది. మరో టికెట్ జేసీ దివాకర్ రెడ్డి కుమారుడైన పవన్ కుమార్ రెడ్డి అనంతపురం ఎంపీ బరిలో ఉంటారని ప్రభాకర్ రెడ్డి చెబుతున్నారు. జేసీ కుటుంబానికి మరో టికెట్ ఇస్తారని ప్రభాకర్ రెడ్డి ధీమాతో ఉన్నారు. ఎందుకంటే అందరూ వేరు.. జేసీ కుటుంబం వేరు అంటున్నారు ప్రభాకర్ రెడ్డి. అందరిని ఒకే ఘాటుకి పార్టీ అధినేత చంద్రబాబు కడతారు అని నేను అనుకోవడం లేదంటున్నారు జేసీ ప్రభాకర్ రెడ్డి.2019 ఎన్నికల్లో జేసీ కుటుంబానికి రెండు టికెట్లు కేటాయించింది టీడీపీ అధిష్టానం. అయితే గడిచిన మూడున్నరేళ్ళుగా జేసీ దివాకర్ రెడ్డి కుమారుడు జేసీ పవన్ రెడ్డి పొలిటికల్‌గా కాస్త ఇదిలావుంటే, ఈసారి అనంతపురం ఎంపీ బరిలో బీసీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని నిలబెట్టాలనే ఆలోచనలో చంద్రబాబు ఉన్నట్లు తెలుస్తోంది.మరోవైపు పరిటాల కుటుంబంలో కూడా రాబోయే ఎన్నికల్లో రెండు టికెట్లు ఆశిస్తున్నారు.

# తేలని ఒంగోలు పంచాయితీ

ఒంగోలు, జనవరి 31 వైఎస్ఆర్‌సీపీలో ప్రకాశం జిల్లా పంచాయతీ తేలడం లేదు. ముఖ్యంగా బాలినేని శ్రీనివాసరెడ్డి డిమాండ్లను హైకమాండ్ పట్టించుకోవడం లేదు. ఐదో జాబితా ముందు ఈ అంశంపై ఓ స్పష్టత ఇవ్వాలని సీఎం జగన్ నిర్ణయించుకున్నారు. ఒంగోలు లోక్ సభ టిక్కెట్ ను.. సిట్టింగ్ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికే కేటాయించాలని బాలినేని శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేస్తున్నారు. కానీ సీఎం జగన్ మాత్రం మాగుంట విషయంలో ఏ మాత్రం ఆసక్తికరంగా లేరు. ఆయనకు కానీ ఆయన కుమారుడికి కానీ టిక్కెట్ ఇచ్చేందుకు సిద్ధంగా లేరు. అలా కాకపోతే తన కుమారుడు ప్రణీత్ రెడ్డికి అయినా చాన్సివ్వాలని కోరుతున్నారు. దానికి కూడా సీఎం జగన్ అంగీకరించలేదు.తిరుపతికి చెందిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి ఒంగోలు ఎంపీ సీటు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. అయితే చెవిరెడ్డికి సపోర్ట్ చేసేందుకు బాలినేని సిద్ధంగా లేరు. ఈ అంశంపై మాట్లాడేందుకు సోమవారం బాలినేని సీఎం క్యాంప్ ఆఫీస్‌కు వచ్చారు. కానీ కారు దిగకుండానే వెనక్కి వెళ్లిపోయారు. చెవిరెడ్డికే ఎంపీ టిక్కెట్ ఖరారు చేసినట్లగా తెలియడంతో.. మాగుంటకు సీటు లేకపోతే తనకు ఫోన్ చేయవద్దని వైసీపీ పెద్దలకు బాలినేని స్పష్టం చేసినట్లుగా తెలుస్తోంది. సీఎం పిలిచినా రాను అని ఖరాఖండిగా చెప్పారని అంటున్నారు. నెల్లూరు, ఒంగోలు కొత్త ఇన్‌ఛార్జ్ గా చెవిరెడ్డిని నియమిస్తున్నామని బాలినేనికి సజ్జల రామకృష్ణారెడ్డి తేల్చిచెప్పారు. దీంతో ఆయన మరోసారి హైదరాబాద్ వెళ్లిపోయారు. రెండో దఫా మంత్రివర్గ విస్తరణ లో పదవిని కోల్పోయిన బాలినేని అప్పట్నుంచి వైసీపీ అధినేత అభిమానాన్ని కోల్పోయారు. బాలినేనికి ఒంగోలు అసెంబ్లీ టికెట్ వస్తుందో రాదో కూడా సరిగ్గా క్లారిటీ లేని పరిస్థితి. అయితే ఇటీవల ఆయనకు టికెట్ విషయం అయితే క్లారిటీ వచ్చింది కానీ.. జిల్లాలో వైసీపీ కీలక నేతగా ఉన్నప్పటికీ నియోజకవర్గాల ఇంచార్జులను నియమించే సమయంలో కనీసం సంప్రదించనే లేదు.

# ఏపీ రాజకీయాలు తెలియదు కానీ...

విజయవాడ, జనవరి 31ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డిని తాను ఎప్పుడూ కలవలేదని కోలీవుడ్ కథానాయకుడు జీవా తెలిపారు. తనకు ఏపీ రాజకీయాల గురించి కూడా అవగాహన లేదన్నారు. మరి, సినిమా ఎలా చేశారని ప్రశ్నిస్తే... "నేను కథను, అందులో కథానాయకుడి పాత్రను అర్థం చేసుకున్నాను" అని సమాధానం చెప్పారు. జగన్ పాత్రలో జీవా నటించిన సినిమా 'యాత్ర 2'. ఫిబ్రవరి 8న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా సినిమాతో పాటు రాజకీయాల గురించి ఆయన మాట్లాడారు.యాత్ర 2'ను పూర్తిగా బయోపిక్ అనలేం. ఇది నాయకుడి జీవితానికి సంబంధించిన పార్షియల్ బయోపిక్. దర్శకుడు మహి వీ రాఘవ్ ఈ కథలో మానవ సంబంధాలు, అనుబంధాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చారు. రాజకీయాలలోకి ఎక్కువగా వెళ్లలేదు" అని జీవా చెప్పారు. తనకు తెలుగు మాట్లాడడం రాదని, తాను ఏపీ రాజకీయాలను ఫాలో కానని, అందువల్ల జగన్ పాత్రలో నటించడం కాస్త కష్టమైన పని అని జీవా చెప్పుకొచ్చారు. అయితే... జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన సమాచారం మీడియాలో అందుబాటులో ఉండడంతో పాటు దర్శకుడు చెప్పిన విషయాలను ఫాలో కావడం వల్ల తన పని సులువైందని ఆయన వివరించారు.రాజకీయ సినిమా కావడంతో 'యాత్ర 2' చేయడానికి తొలుత తాను సందేహించానని జీవా తెలిపారు. అయితే... మహి వీ రాఘవ్ ఈ సినిమా కంటే ముందు తీసిన 'యాత్ర' చూసిన తర్వాత తనకు కాన్ఫిడెన్స్ వచ్చిందన్నారు. ఇంకా ఈ సినిమా, దర్శకుడు మహి గురించి జీవో మాట్లాడుతూ... "రాజకీయ నేపథ్యమున్న కథలను తీసుకుని సినిమాలు తెరకెక్కించడంలో మహికి ఒక సపరేట్ స్టైల్, క్లాస్ ఉన్నాయి. తండ్రికిచ్చిన మాటను నెరవేర్చడం కోసం ఒక కొడుకు ఏం చేశాడు? ఆ క్రమంలో, ఆ ప్రయాణంలో ఆ కొడుకు ఎటువంటి పరిణామాలు ఎదుర్కొన్నాడు? అనేది మా సినిమాలో ప్రధాన అంశం" అని తెలిపారు. ముఖ్యమంత్రి కావడానికి ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనయుడిగా జగన్ మోహన్ రెడ్డి ఎక్కువ మంది ప్రజలకు తెలుసు. ఆ తర్వాత ఆయనకంటూ ఒక పేరు తెచ్చుకున్నారు. జీవా విషయానికి వస్తే... ఆయన హీరో అవ్వడానికి ముందు నిర్మాత ఆర్.బి. చౌదరి కుమారుడిగా ప్రేక్షకులకు తెలుసు. ఆ తర్వాత హీరోగా తనకంటూ ఒక పేరు తెచ్చుకున్నారు. తండ్రి లెగసీని నిలబెట్టిన కుమారులుగా ఇద్దరూ పేరు తెచ్చుకున్నారు. "జగన్ ముఖ్యమంత్రి మాత్రమే కాదు... ఇద్దరు కుమార్తెలకు తండ్రి. భార్యను ప్రేమించే భర్త. ఫ్యామిలీకి ఎంతో వేల్యూ ఇస్తారు. నేను కూడా ఫ్యామిలీకి వేల్యూ ఇస్తా" అని జీవా చెప్పారు.ప్రచార చిత్రాల్లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డిగా జీవా నటనకు మంచి పేరు వచ్చింది. మరి, రేపు సినిమాలో ఎలా ఉంటుందో చూడాలి. ఆల్రెడీ విడుదల చేసిన పాటలు సైతం ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. ఈ సినిమా కోసం ఇటు చిత్రసీమ, అటు రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి.

# ముద్రగడత దారెటు...

కాకినాడ, జనవరి 31 కాపు ఉద్యమ నేతగా మూడు దశాబ్ధాలకు పైబడి ఉద్యమ బాటలో ఉన్న నేత మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇప్పుడు ఆయన రాష్ట్ర రాజకీయాలవైపు చూస్తున్నారా అంటే ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను పరిశీలిస్తే అవునే వినిపిస్తోంది.. ఆయన పోటీచేసేందుకు ముందుకు రాకపోయినా ఆయన కుమారుడు గిరిరావు ఈసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలో దిగుతారన్న ప్రచారం జరుగుతోంది. దీనికి తోడు పలు పార్టీ నాయకులు ఇప్పటికే ముద్రగడను ఆయన ఇంటి వద్ద నేరుగా వెళ్లి కలవడం, ఆయన కుమారుడు కూడా నాన్న ఆదేశిస్తే పోటీకు సిద్ధం అంటూ ప్రకటించడం బట్టి చూస్తే ముద్రగడ కుటుంబం మరోసారి ఎన్నికల బరిలో ఉండడం ఖాయం అన్నది స్పష్ట మవుతోంది.ముద్రగడ తన సామాజిక వర్గ అభ్యున్నతి కోసం పోరాటం చేస్తున్నారో.. అదే సామాజికవర్గంలో మెజార్టీ వర్గం ముద్రగడ ప్రత్యక్షరాజకీయాల్లోకి రావడం కంటే కుల ఉద్యమనేతగానే చూడాలనుకుంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన కృషి వల్లే ప్రస్తుతం కాపులకు చాలా వరకు ప్రయోజనం చేకూరుతోందని, ఇదే కొనసాగించడం ద్వారా కాపులకు మరింత మేలు జరిగే అవకాశం ఉంటుందని చర్చ జరుగుతోంది. అదే ఏదైనా పార్టీ తరపున ఆయన ఎన్నికల బరిలో దిగితే ఉద్యమంపై పట్టు కోల్పోవడం జరుగుతుందని, దీనివల్ల కాపు హక్కులు సాధనకు ఇబ్బందులు తలెత్తుతాయని అభిప్రాయపడుతున్నారు..కాపు రిజర్వేషన్ల ఉద్యమ సమయంలో, ముద్రగడ పద్మనాభం చేపట్టిన అన్ని కార్యక్రమాల్లోను ఆయన వెన్నంటి ఉండే పలువురు కాపు ఉద్యమ నాయకులు ఇప్పటికీ ముద్రగడ వెంటే నడుస్తున్నారు. వారిలో కొంత మంది పలు పార్టీల్లో కూడా ఉన్నారు. ఇందులో మెజార్టీ వర్గం అయితే ముద్రగడ ఏదైనా పార్టీలో చేరే కంటే స్వతంత్రంగా ఉంటూ పార్టీ ముద్రను మీద పడనీయకుండా కాపు ఉద్యమం కోసం పాటుపడితే అనుకున్న లక్ష్యం తప్పకుండా సాధించగలరని ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. అవసరమైతే తాము కూడా పార్టీలను వీడి ముద్రగడ వెంట పూర్తిస్థాయిలో ఉండేందుకు సిద్ధం అంటున్నారట..ముద్రగడ పద్మనాభం వైసీపీకి అనుకూల ధోరణిలో కనిపించారు. ఉభయగోదావరి జిల్లాల ఇంచార్జి, ఎంపీ మిథున్ రెడ్డి స్వయంగా



ముద్రగడను కలిసి పలు విషయాలు చర్చించారు. ఆతరువాత వైసీపీ దూతగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కూడా పలు సార్లు ముద్రగడ గడప తొక్కి పార్టీలోకి రావాలని ఆహ్వానం కూడా పలికారు... అయితే ఈవిషయంలో ఇప్పటికీ ఎటువంటి ప్రకటన వెలువడలేదు..

## శాంతినికేతన్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

**పీడీఎస్ యూ ఎస్ఎఫ్ఐ - ఐసా- ఎన్ ఎస్ యూ ఐ**



విభారె న్యూస్‌నంద్యాలమాప్రతినిధిజనవరి31-ప్రభుత్వ నిబంధనలకువిరుద్ధంగానడుస్తున్నశాంతినికేతన్‌విద్యా సంస్థల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పీ డీ ఎస్ యూ జిల్లా కార్యదర్శి రాంబాబు,ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షుడు కుమార్,ఐసా జిల్లా కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక నంద్యాల పట్టణంలోని మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మం గారికి సమస్యలతోకూడిన వినతిపత్రం ఇవ్వడం జరిగింది. చర్యలు తీసుకోవాలనిలేనిపక్షంలోదశల వారీగా ఆందోళన నిర్వహిస్తామని. విద్యా శాఖ అధికారి కార్యాలయం ముట్టడిస్తామని. స్కూల్ ముందు ప్రత్యక్ష ఆందోళనలు కూడా చేపడతామని హెచ్చరించారు.

## చిర్తనకల్లులో శ్రీ మారెమ్మ అవ్వ దేవర ఉత్సవాలు





కోసిగి, జనవరి31(విభారె న్యూస్) మండల పరిధిలోని చిర్తనకల్లు గ్రామంలో వెలసిన శ్రీ మారెమ్మ అవ్వ దేవర ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం కోసిగి మండల ఇంచార్జీ పి మురళీమోహన్ రెడ్డి పాల్గొన్నారు.ముందుగా పెద్దమ్మ, దేవమ్మ,మారెమ్మ అవ్వాలకుప్రత్యేకపూజలు నిర్వహించి, మొక్కలు తీర్చుకొన్నారు.అనంతరం గ్రామ నాయకులు అతిథులకు శాలువాలు కప్పి,పూలమాలలు వేసి సత్కరించారు. ఈకార్యక్రమంలో యంపీపీ ఈరన్న,వైకాపా మండల అధ్యక్షులు బెట్టనగౌడ్,జగదీష్ స్వామి,చిర్తనకల్లు, ముగలదొడ్డి, తుమ్మిగనూరు సర్పంచ్లు పాటిల్ ఈరన్న, సోమేష్,వారం ఈరన్న, సాతనూరు చంద్ర,మర్రిస్వామి, బీమేష్,గ్రామ నాయకులు రామిరెడ్డి,విజయభాస్కర్, నర్సప్ప,శివలింగయ్య,రామిరెడ్డి,ఉలిగయ్య,వీరారెడ్డి,రంగస్వామి, తాయప్ప,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వోకేషనల్ కోర్స్ వల్ల విద్యార్థులు టెక్నికల్ గా అభివృద్ధి....



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- జనవరి 31డోన్ పట్టణం పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి ఆద్వర్యంలో 9,10 విద్యార్థులకు వొకేషనల్ ట్రైనర్ అల్లిపీరా, మహేష్ డోన్ పట్టణం లోని కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ ఫోటాన్ ఇన్స్టిట్యూట్ కు తీసుకెళ్లి, శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఫోటాన్ ఇన్స్టిట్యూట్ అధినేత సాయినాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వొకేషనల్ కోర్సు చదివించడం వల్ల, వారు టెక్నికల్ గా అభివృద్ధి చెంది, వారు జీవితం లో రాణించాలని కోరారు. కంప్యూటర్ కోర్సులు సి, సి+, జావా లాంటి కోర్సులతో పాటు మైక్రోసాఫ్ట్ వర్డ్, విండోస్, ఎక్సెల్, టైపింగ్ పై పట్టు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, వెంకట రమణ, శ్రీనివాసులు, ప్రసాద్ రావు, కంప్యూటర్ ప్యాకల్టీ కిరణ్, యశ్వంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల పట్టణాభివృద్ధే ధ్యేయం

**మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా**






విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 31-నంద్యాల పట్టణాభివృద్ధిలో భాగంగా మున్సిపల్ వార్డులను అభివృద్ధి చేయాలన్నదే ధ్యేయమని మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా అన్నారు. నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ మాబున్నిసా అధ్యక్షతన కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ బడ్జెట్ సమావేశం నిర్వహించారు.బడ్జెట్ అజెండా లోని అంశాలను మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి వినిపించారు. 2023-24 సంవత్సరంలో మిగులు బడ్జెట్ 45 కోట్ల 29 లక్షలని, దానిని వివిధ పనులకు కేటాయించిన్నట్లు ప్రకటించారు. వాటర్ సప్లైకి పదికోట్ల నలభైరెండు లక్షలు, డ్రైనేజి ఏడు కోట్ల ఇరవై ఐదు లక్షలు, రోడ్లకు తొమ్మిది కోట్ల యాభై ఒక్క లక్ష, స్ట్రీట్ లైట్ కు నాలుగు కోట్ల ఎనిమిది లక్షలు, పార్కు లకు ఐదు కోట్ల నలభైమూడు లక్షలు, మార్కెట్లు, పార్కుల నిర్వహణకు ఎనిమిది కోట్ల అరవై ఒక్క లక్షలు కేటాయించామన్నారు అనంతరం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. 34 వార్డులో ఏ ఒక్క పని జరగలేదని కౌన్సిలర్ మాబువలి ఆవేదన వ్యక్తం చేశారు. 18వార్డు కౌన్సిలర్ దేశం సులోచన మాట్లాడుతూ టెండర్లు పిలవకుండా పనులు జరుగుతున్నాయని, లక్షలు డ్రా అవుతున్నాయని, ఆ లక్షలు ఎక్కడకు వెళుతున్నాయని నిలదీశారు. శానిటేషన్ వర్కర్స్ కు సరైన నూనె, సబ్బులు ఎందుకు ఇవ్వడం లేదని, బ్లీచింగ్ పౌడర్ గత సంవత్సరం కింద వచ్చిందని, కాని డబ్బులు మాత్రం ప్రతి సంవత్సరం డ్రా చేస్తున్నారని, మున్సిపాల్టీలో లక్షలు డ్రా అవుతుంటే తమరికి తెలియదా అని మున్సిపల్ ఛైర్మన్ ను ప్రశ్నించారు. దీనిపై శ్వేత పత్రం విడుదల చేయాలని కోరారు . కొన్ని వార్డుల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని పలువురు కౌన్సిలర్లు సభా దృష్టికి తీసుకొచ్చారు .ఈ సమావేశంలో మున్సిపల్ ఎమ్ ఈఈ రమణ మూర్తి. డీఈలు మదు కుమార్. శ్రీనివాస్ రెడ్డి. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకి రెడ్డి. టౌన్ ప్లానింగ్ అధికారి రెజ్వాన . సీ ఎం ఎం విజయ భాస్కర్ రెడ్డి. ఆర్ ఓ వెంకట కృష్ణ. ఎఇ హిమబిందు. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .

## సేవాకార్యక్రమాలను చేసే వారిని విమర్శించకండి: ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 31-శిల్పా సేవాసమితి ఆద్వర్యంలో గత 25 సంవత్సరాల నుండి నిరంతరాయంగా ప్రజలకు సేవాకార్యక్రమాలను చేపడుతున్నామని, చేతనైతే సేవాకార్యక్రమాలను చేయాలేగాని చేసే వారిని విమర్శించడం ఎంత వరకు సబబో చెప్పాలన్నారు. శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ ద్వారా 185 మంది పేదింటి అక్కాచెల్లెమ్మలకు 25 లక్షల65వేల రూపాయాల రుణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి, బ్యాంక్ చైర్మన్ నాగినిరవిసింగారెడ్డి చేతులమీదుగా అందజేయడం జరిగింది. అలాగే స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నందు శిక్షణ పొందిన మహిళలకు ప్రశంసాపత్రాలను వారు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తన తండ్రి మాజీ మంత్రి శిల్పామోహన్ రెడ్డి చిన్న స్థాయి నుండి కష్టాల నుండి వచ్చిన వారని, అటువంటి వారికి పేదల కష్టాలు తెలుసని అన్నారు. అందువల్లనే తన వంతుగా శిల్పాసేవాసమితిని స్థాపించి 25 సంవత్సరాలుగా నిరంతరాయంగా సేవాకార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. తమ సేవాకార్యక్రమాలను విమర్శించే కోటీశ్వరులు, నవాబులు, ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్నవారు పేదల కోసవ చిల్లిగవ్వకూడా వెచ్చించరని అన్నారు , ఎటువంటి లాభాపేక్షలేకుండా తాము సేవకార్యక్రమాలు చేస్తుంటే విమర్శించడం ఎంతవరకు సబబో వారే చెప్పాలన్నారు.. కరోనా కాలంలో ప్రజలు కష్టాలు పడుతుంటే ప్రజల మధ్య ఉంటూ వారికి సేవలను అందిస్తూ భరోసాగా ఉన్నామన్నారు. తమను పమర్శించే వీరంతా కరోనా కాలంలో ఎక్కడ దాక్కున్నారో చెప్పాలన్నారు. కష్టాల్లో ఉన్నప్పుడు సాయం చేసిన వారిని ఎన్నడు మరచిపోరాదని, కష్టాలలో ఉన్నప్పుడు కాకుండా బాగా ఉన్నప్పుడు వచ్చి పలుకరించే వారిని జీవితంలో నమ్మవద్దన్నారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా మాసేవాకార్యక్రమాలు ఆగవని అవి కొనసాగుతుంటాయన్నారు. రానున్న ఎన్నికల్లో తనకు ఓట్లు వేసి గెలిపించాలని, ఆశీర్వదించాలని కోరారు. భవిషత్తులో మరింత సేవాకార్యక్రమాలను చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ హరిలీల, సిబ్బంది పాల్గొన్నారు.

# డోన్ లో రైతుల కరువు కేక....

**డోన్, ప్యాపిలి మండలాలను కరువు మండలాలుగా తక్షణమే ప్రకటించాలి...:టిడిపి జనసేన డిమాండ్**





విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- జనవరి 31 డోన్, ప్యాపిలి మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని రైతుల కరువు కేక కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్, డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి,డోన్ నియోజకవర్గ టిడిపి అబ్జర్వర్ కమతం కాటమయ్య , రాష్ట్ర తెలుగుదేశంపార్టీ కార్యదర్శి వలసల రామకృష్ణ, మాజీ ఎంపిపి ఆర్.ఈ.రాఘవేంద్ర హాజరయ్యారు. ఈ కార్యక్రమం డోన్ మండలం టిడిపి అధ్యక్షులు సలీంద్ర శ్రీనివాసులు యాదవ్, ప్యాపిలి మండలం టిడిపి అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య, డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించడమైనది.ఈ కార్యక్రమం డోన్ పట్టణంలో తెలుగుదేశంపార్టీ కార్యాలయం నుండి ఎద్దుల బండ్లతో ర్యాలీగా పాత బస్టాండ్ మీదుగా వెళ్లి ఆర్డీఓ కార్యాలయం నందు వినతిపత్రం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో డోన్ మండలం , ప్యాపిలి మండలాలలో రైతులు వేరుశనగ , ఆముదం , కంది ,పత్తి , టమోటా ప్రధాన పంటలు వేస్తారు. అయితే గత 100ఏళ్ళలో ఎన్నడులేని విధంగా 2023సంవత్సరంలో కరిఫ్ లో లోటు వర్షపాతం నమోదు అయింది. డోన్ ,ప్యాపిలి మండలాలలో కరువు వలన రైతుల కన్నిటీదారులవ్వడమైనది. రైతులు పెట్టిన పెట్టుబడులు తిరిగిరాక అప్పుల ఊబి లో కూరుకపోయారు. సక్రమంగా సర్వే జరిగి ఉంటే డోన్ ,ప్యాపిలి మండలాలు కరువు మండలాలుగా ప్రకటించడం జరిగి ఉండేది . మీరు ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి డోన్ మండలం ,ప్యాపిలి మండలాలు కరువు మండలాలుగా ప్రకటించాలని తెలుగుదేశం-జనసేన పార్టీల తరుపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు.అదేవిధంగా నేషనల్ హైవే-44 డోన్ నుండి నేషనల్ హైవే-40 సోమయాజులపల్లె వరకు జరుగు నేషనల్ హైవే 340-ః రోడ్డు పనులకు 26.05.2023 తేది ఆర్థికమంత్రి బుగ్గన శంకుస్థాపన చేయడం జరిగింది. ఆరోజు నుండి ఈ రోజు వరకు కానీ రహదారి విస్తరణ లో భూములు కోల్పోయిన రైతులకు ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా పనులు చేయుచున్నారు. రోడ్డు విస్తరణ లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఎపుడు ఇస్తారో ఎప్పటి వరకు చెప్పడం లేదు . కావున ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి తక్షణమే రైతులందరికీ నష్టపరిహారం ఇవ్వవలసినదిగా డిమాండ్ చేస్తున్నాం. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వని పక్షములో రైతులతో పాటు తెలుగుదేశం-జనసేనా పార్టీల తరుపున పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో డోన్ నియోజకవర్గ టిడిపి సలహాదారుల కమిటీ అధ్యక్షులు మురళీకృష్ణ గౌడ్,రాష్ట్ర తెలుగుదేశంపార్టీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, నంద్యాల జిల్లా టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల బెస్తా మల్లిఖార్జున, రైతు కమిటీ నాయకులు పెద్దపూదేళ్ళ ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర ఈడిగ సాధికార కమిటీ నాయకులు ఆర్.ఈ.నాగరాజు, డోన్ పట్టణ టిడిపి సమన్వయ కమిటీ చైర్మన్ అలా మల్లిఖార్జున రెడ్డి,సీనియర్ టిడిపి నాయకులు టి.ఈ.వెంకటనారాయణ గౌడ్, అంకిరెడ్డి,రాష్ట్ర తెలుగుదేశంపార్టీ తెలుగుయువత ఉపాధ్యక్షులు, తమ్మినేని రాజశేఖర్ నాయుడు, నంద్యాల జిల్లా టిడిపి రైతు కమిటీ ఉపాధ్యక్షులు సత్యం, నంద్యాల జిల్లా టిడిపి కార్యదర్శి అబ్బిరెడ్డిపల్లె గోవిందు, తిమ్మయ్య యాదవ్ ,నంద్యాల జిల్లా టిడిపి బీసీ కమిటీ నాయకులు మల్లెంపల్లె జయ్యన్న , నంద్యాల జిల్లా టిడిపి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు రాముడు,నంద్యాల జిల్లా టిడిపి రైతు కమిటీ కార్యదర్శి జలదుర్గం విష్ణు,డోన్ నియోజకవర్గ టిడిపి రైతు కమిటీ అధ్యక్షులు మల్లయ్య, రాంమోహన్ రెడ్డి, యూనిట్ ఇంచార్జ్ కమలాపురం రమేష్ , ప్యాపిలి పట్టణ టిడిపి అధ్యక్షులు భూశెట్టి చిన్న సుంకయ్య, నంద్యాల జిల్లా మైనారిటీ ప్రధాన కార్యదర్శి ఖాజా పీరా, నియోజకవర్గ టిడిపి బీసీ కమిటీ నాయకులు నాగేంద్ర, జిల్లా రైతు కమిటీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాజశేఖర్ రెడ్డి,డోన్ నియోజకవర్గ టిడిపి తెలుగుయువత అధ్యక్షులు కుమ్మరి సుధాకర్, నంద్యాల జిల్లా టిడిపి టీఎన్ టీయూసీ అధ్యక్షులు అజీజ్,క్లస్టర్ ఇంచార్జ్ గోవిందు, యాపదిన్నె సర్పంచ్ రామిరెడ్డి, యూనిట్ ఇంచార్జ్ ఎద్దుపెంట ఈశ్వరయ్య , డోన్ పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు ఉపేంద్ర, డోన్ పట్టణ టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు చక్రపాణి గౌడ్,డోన్ మండలం టిడిపి ప్రధాన కార్యదర్శి ఎల్ఐసి శ్రీరాములు, డోన్ పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రఫీ, క్లస్టర్ ఇంచార్జ్ షరఫ్ మధుసూదన్, జనసేనా బ్రహ్మం, మల్లెంపల్లె ఎస్పీ సుంకన్న, నియోజకవర్గ టిడిపి బీసీ సెల్ కమిటీ నాయకులు వలసల సుధాకర్,గండికోట రామాంజినేయులు,ప్యాపిలి మండలం టిడిపి తెలుగుయువత అధ్యక్షులు కోదండరాముడు తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తునపాల్గొన్నారు.





EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190